


## డ్యూయల్ రోల్!

మొహం చూచి జాతకం చెప్పవచ్చని చాలామంది అంటారు. అయ్ డోంట్ బిలీవిట్. నన్నెవరు చూసినా చాలా మంచివాడు పాపం అంటారు. కానీ, నా జాతకమేమిటో నాకు తెలుసు. నా మొహం ఇందర్ని మోసగిస్తుంటే నవ్వుకుంటానే తప్ప, అయ్యా నేను ఫలానా అని చచ్చినా చెప్పను. అది నా స్పెషాలిటి. నాలాగా ఎందరీ భూమ్మీద బతుకుతున్నారో నేను ఆరా తీయలేదు గానీ, చాలామంది ఉండి వుంటారని మనసార నమ్ముతాను.

జనం వేషధారణకి పడిపోతున్నారని నేనిప్పుడే గమనించాను. మనిషి నొదిలేసి వేషాన్ని పట్టుకునే ఆచారానికి మనం ఎంత త్వరగా

ఉద్వాసన చెబితే అంత మంచిది. ఎంత కాదనుకున్నా వేషానికున్న విలువ నువ్వు కాదుగదా, నీ గ్రాండ్ ఫాదర్ కూడా తుడిచేయలేడని మా కొల్లీగ్ అన్నప్పుడు నిజమేనేమో అనిపించింది. జైశంకర్, శంభో హరహర మహాదేవ అంటూ శంఖం పూరించే స్వాములవారు మామూలు మనిషి వేషంలో కనిపిస్తే డిమేండు తగ్గిపోతుంది. అతను కాషాయ వస్త్రాలే ధరిస్తాడు. గెడ్డం, మీసాలూ పెంచుకుంటాడు. కమండలం పట్టుకుంటాడు. పాంకోళ్ళు తొడుక్కుంటాడు. ఇంత హడావిడి చేస్తేగాని మన కంటికి అతను స్వాములోరు కాలేడు. అప్పటిగ్గాని అతనిమీద మనకి నమ్మకం కుదరదు. అదే మనిషి నుబ్బరంగా షేవ్ చేసుకుని, లాగూ, చొక్కా తొడుక్కుని, బాటా చెప్పులేసుకుని సుద్దులు చెప్పమనండి. ఛస్తే వినం. పోపోవోస్ అని తీసి పారేస్తాం. అంతెందుకు జ్యోతిలక్ష్మి చేతనో, జయ మాలిని చేతనో సీతమ్మవారి వేషం వేయించి సినిమా తీస్తే, రావణబ్రహ్మ సీత నెత్తుకు పోవడం ఎంతో సబబని వాదించి అలిసిపోతామేగాని రామాయణ గాథని పట్టించుకోం. ఎందుకొచ్చిందీ తేడా అని అడగండి. దానికి ఒకటే రీజను ఫేసు వేల్యూ.

సినిమా విషయం కదిలింది గనక కొంతసేపు ఆ ఫీల్డు ముచ్చట్లనే చెప్పుకుందాం. సినిమాలో రకరకాల పాత్రలు చూస్తుంటాం. ఫలానా పాత్రకి ఫలానా వారే కావాలని అనుకుంటాం. ఎందుచేత? పాత్ర ఫేసు పాత్రధారి ఫేసుకి సరిపోతుందనే నమ్మకం ఎంతో వుంటుంది కనక అలా అను కుంటాం. హీరో మొహం ఇట్లా వుండాలి. హీరోయిన్ కాలుతూలు ఇట్లా గిట్లా వుండాలి. విలన్ మొహం చూడగానే జన కెవ్వుమనాలి. కమేడియన్ తెరమీద కనిపిస్తేచాలు పొట్టచెక్కలు కావాలనే సిద్ధాంతాన్ని మన మెప్ప ట్నుంచో గౌరవిస్తూ వస్తున్నాం. హీరో మొహం గల ఆసామి బ్రతుకులో పరమ దుర్మార్గుడు కావచ్చు. హీరోయిన్ గుణం ఆఫ్టరాల్ కావచ్చు. విలన్ సాధువుగా వుంటే కమేడియన్ సీరియస్ మనిషిగా బతకొచ్చు. ఉయ్

డోంట్ కేర్ .... మనకి మొహాలే కావాలి. మొహాలు చూసి పడిపోతామే గాని గుణాలు ప్రత్యేకించి వుంటాయంటే పట్టించుకోం.

నాకు తెలిసిన సినీ విలన్ ఒకతను వున్నాడు. అతను ఎన్నో సినిమాల్లో ఎంతో భీభత్సంగా నటించడం నాకు తెలుసు. ఆడవాళ్ళని పాడు చేసేడు. మంచివాడ్ని హింస పెట్టేడు. దొంగతనాలు, దోపిడీలు వగైరా కిరాతకప్పనులు తెరమీద సవాలక్ష చేసేడు. అతని రూపం ఆ పన్లన్నింటికీ సూటయింది. సూటయింది గదా ఆ మనిషి కూడా అంతేనని తీర్మానిం చేస్తే అతన్ని తెలిసినవాడ్ని అతనికంటే ఎక్కువగా నేను బాధపడతాను. దేవుడిచ్చిన రూపం వంకరగా వుంటే వుండొచ్చుగానీ అతను నిజ జీవితంలో గంగిగోవు. మచ్చలేని ప్రవర్తన అతని ఆస్తి. ఇప్పటికొచ్చి అతను వాళ్ళ తల్లిదండ్రుల ముందు కనీసం సిగరెట్టయినా కాల్చలేడంటే మీరు నమ్మాలి. ఫర్లాంగు దూరంలో మీ నాన్న వున్నాడని చెప్పండి చాలు. అతను కాల్చే సిగరెట్టు చెప్పు కిందవేసి నలిపేస్తాడు. ఎక్కడ వాసన వస్తుందోనని సెంటు రాసిన జేబురుమాల్తో మూతిని పాతిక తడవలు తుడుచుకుంటాడు. ఇంత వక్కపొడి నోట్లో వేసుకుని గబగబా నమిలేస్తాడు. తండ్రి కనిపిస్తే తన చుట్టూతా ఎందరున్నా లేచి నించుంటాడు. కొడుకుని యిబ్బంది పెట్టడం యిష్టంలేక ఆ తండ్రి అక్కడ్నించి తప్పుకోవాలేగానీ ఆయనెదుట చచ్చినా కూచోడు. ఆడవాళ్ళ వేపు చూడనే చూడడు. వాళ్ళు పలకరిస్తే తలొంచుకొని ఎంతో వినయంగా జవాబు చెబుతాడు. పసిపిల్లలంటే ఎంతో యిష్టం. వాళ్ళను ఎత్తుకొంటారు. ముద్దాడుతాడు. వాళ్ళు అతని బట్టలు ఖరాబుచేస్తే పకపకా నవ్వుతాడు. బల్లిని చూస్తే బేర్ మంటాడు. చీకటంటే పరమ భయం. ఇన్ని గుణాలున్న ఆ మనిషి ఆకారం మాత్రం భయంకరంగానే ఉంటుంది. అట్లాంటప్పుడు రూపాన్ని గుణంతో ముడిపెడితే ఏమి న్యాయం చెప్పండి ?

నటుల్ని వదిలేయండి. రచయితల్లో కూడా చమత్కారు లున్నారు. రచనలు చదివి ఆ రచయిత గుణమేమిటో చెబుతానని ఛాలెంజి చేయకండి. దెబ్బ తినేస్తారు. పేదలే నా ఊపిరని కథలూ, కవిత్వాలూ రాసే రచయితలు పేదవాడు కనిపించి అయ్యా అంటే ఛీ పొమ్మంటారు. అట్లాగే కెబరెట్ డాన్స్ గురించి, బ్లూఫిలిమ్ గురించి ఘణ్ణంగా రాసిన రచయిత్రిని మీరు శంకిస్తే కళ్ళు పోతాయి. మనుషులలో రూపాలూ, గుణాలూ వేర్వేరుగా ఎట్లా వుంటాయో...రచయితలలో రచనలూ, వాటి కామందులూ మీ అంచనా లకు దొరకరు. ఇది స్వానుభవంతో చెప్పుకుంటున్నాను గనుక మీరు నమ్మి తీరాలి.